క్లుప్తంగా

ముదిరాజ్‌లను బీసీ-ఏ జాబితాలో చేర్చాలి



కడా కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందిస్తున్న వెంకటయ్య తదితరులు

కొడంగల్ రూరల్: ముదిరాజ్‌లను బీసీ–ఏ జాబితాలోకి చేర్చాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర వెంకటయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని కడా కార్యాలయ సిబ్బందికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్నో పర్యాయాలు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్ సంఘం సభ్యులు, నాయకులు సంఘటితంగా పోరాటం చేసేందుకు సన్నద్ధం కావాలన్నారు.

పెరుగుతున్న వేరుశనగ ధర



వ్యవసాయ మార్కెట్లో రైతులు తీసుకొచ్చిన వ్యవసాయ ఉత్పత్తులు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్లో ప్రతీవారం కందులు, వేరుశనగ ధరలు పెరుగుతున్నాయి. గత వారం కందులు క్వింటాల్‌కు రూ.7,510 ఉండగా, ఈ వారం స్వల్పంగా రూ.7,520 వరకు పెరిగింది. మార్కెట్లో నిర్వహిస్తున్న బీట్లను స్వయంగా పరిశీలిస్తూ రైతులకు తగిన మద్దతు ధర వచ్చేలా సహకరిస్తున్నామని మార్కెట్ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. శనివారం మార్కెట్‌కు కందులు 1,013 సంచులు, వేరుశనగ 749 సంచులు వచ్చాయని తెలిపారు. ఈ వారం మార్కెట్‌కు మొక్కజొన్న 102 సంచులు వచ్చాయని, క్వింటాల్‌కు తక్కువగా రూ.2,300లు, మధ్యస్తంగా రూ.2,350ల నుంచి రూ.2,390 వరకు అమ్మకాలు జరిగాయని ఆమె వివరించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని సిద్దనొంపు పడమటి ఆంజనేయ స్వామివారి దేవాలయంలో హిందూవాహిని ఆధ్వర్యంలో శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అంతకుముందు ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ శనివారం నిర్వహిస్తున్నా సామూహిక హనుమాన్ చాలీసా, భక్తి గీతాలతో 74వ వారం పూర్తి చేసుకున్నట్లు హిందూవాహిని సభ్యులు తెలిపారు.

శ్రీశైలం బయలుదేరిన శివస్వాములు



ఇరుముడితో శివస్వాములు

కుల్కచర్ల: శివమాల ధరించిన శివస్వాములు శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. శనివారం కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన శివస్వాములు ఇరుముడులు కట్టుకుని శ్రీశైలం బయలు దేరారు.

నేడు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

కుల్కచర్ల: గురుకుల పాఠశాలలో ఐదోతరగతిలో ప్రవేశాలకుగాను ఆదివారం ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరంలో 5వ తరగతి ప్రవేశానికి 260మంది, అదేవిధంగా 6వ తరగతి నుంచి 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు గాను 257మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారని ఆయన తెలిపారు. పరీక్ష సమయం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుండగా 10గంటలలోపే పరీక్ష కేంద్రంలోకి రావాలని ఆయన సూచించారు.

జినుగుర్తి గురుకల పాఠశాలలో..

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి సమీపంలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్షకు వచ్చే విద్యార్థులు సమయానికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ హేమలత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వతరగతి నుంచి 9వతరగతి వరకు ప్రవేశాల కోసం పరీక్ష ఉంటుందని ఆమె తెలిపారు. 320 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఆదివారం ఉదయం 8:30 గంటలకు పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని సూచించారు.

బాల్యం బందీ..!

ఆయా పనుల్లో కాలం వెళ్లదీస్తున్న బాలలు

- వలస జీవులకు తప్పని వెతలు
- ఇటుక బట్టీల్లో నిబంధనలు గాలికి
- పట్టించుకోని అధికారులు



ఇటుక బట్టీ కాల్చేందుకు కట్టెలు తీసుకెళ్తున్న బాలుడు

కుల్కచర్ల: బలపం పట్టుకోవాల్సిన బడీడు పిల్లలు ఇటుక బట్టీల్లో కూలీలుగా కాలం వెళ్లదీస్తున్నారు. ప్రజాస్వామ్యం, సమాజ అభివృద్ధిపై గొప్పలు చెప్పుకునే నేతలు, బాలల హక్కులను కాపాడాల్సిన అధికారులు వారిగురించి పట్టించుకోవడం లేదు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిధిలో ఏర్పాటుచేసిన ఇటుక బట్టీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన వలసకూలీలు తమ పిల్లలతో బట్టీల వద్దనే నివాసం ఏర్పాటు చేసుకుని పిల్లలను వారి వద్దే ఉంచుకుని జీవనం సాగిస్తున్నారు. దీంతో బడీడు పిల్లలందరూ బడికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

కానరాని ఆపరేషన్ ముస్కాన్

పోలీసులు, స్త్రీ శిశుసంరక్షణ, రెవెన్యూ, విద్యాధికారులు, బాలల హక్కుల కమిటీ సభ్యులందరూ ఒక కమిటీగా ఏర్పాటు చేసి బడీడు పిల్లలు ఎక్కడైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, వెట్టిచాకిరి చేస్తున్నా, బడులకు దూరంగా ఉంటున్నా, పనులు నిర్వహిస్తున్నా వారిని సంరక్షించి పరిస్థితులకు అనుగుణంగా వారికి నివాసాన్ని కల్పించడంతో పాటు చదువుకునేలా అవగాహన కల్పించాలి. కానీ ప్రస్తుతం ఇటుకబట్టీల్లో పిల్లలు బందీలవుతున్నా అధికారులు నిర్వహించాల్సిన ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ వంటి వాటిపై దృష్టి సారించడం లేదు. ఈ విషయంలో వారికి పునరావసం కల్పించడంలో కూడా విఫలమవుతున్నారని పలువురు వాపోతున్నారు.

చిన్న పిల్లలతో పనులు..

పొట్టచేతబట్టుకుని ఇటుక బట్టీల నిర్వాహకుల వెంట వచ్చిన వలసజీవులు తమతో పాటు పిల్లలను వెంటతెచ్చుకుని ఆయా పనులు నిర్వహింపజేస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా ఇటుక బట్టీల నిర్వాహకులు తక్కువ వేతానానికి, ఎక్కువ పనిచేసేవారు లభిస్తుండటంతో వారి వయస్సును కూడా చూడకుండా చిన్నపిల్లలచేత పనులు నిర్వహింపజేస్తున్నారు. బతుకుదెరువు కోసం వచ్చినవారికి రోజువారి జీవనం కోసం డబ్బులు అవసరం. దీంతో కూలీ పనులు చేసుకునే వారికి ఈ భట్టీల్లో కొంత సౌకర్యవంతంగాను, లాభసాటి కూలి లభిస్తుండడంతో వలసలు ఎక్కువవుతున్నాయి. చిన్న పిల్లలు ఉన్న కుటుంబాలు కూడా జీవనాధారం కోసం బట్టీల్లో పనిచేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. వలసలుగా పనులకోసం వచ్చేస్తున్నారు. కుల్కచర్ల, ఘనాపూర్, కామునిపల్లి, అల్లాపూర్, ఘండిచెరువు, చౌడాపూర్, వీరాపూర్ తదితర గ్రామాల్లో ఇటుక బట్టీలను చిన్నతరహా పరిశ్రమల వలే పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు.

అధికారుల కనుసన్నల్లోనే..

ఇటుక బట్టీల నిర్వహణ మొత్తం అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు పలు కారణాలు ఉన్నాయి. ఇటుక బట్టీల నిర్వహణకు మట్టి అవసరం ఉండగా వారు ఎలాంటి అనుమతులు లేకుండా రెవెన్యూశాఖలోని కొందరితో ఒప్పందం కుదుర్చుకుని మట్టిని దర్జాగా సరఫరా చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మొక్కల పెరుగుదలకు కృషిచేయాలని, చెట్లను నరకొద్దని చెప్పే అటవీశాఖ అధికారులకు ఇటుక బట్టీల వద్ద పెద్దెత్తున ఉండే కలప కనిపించకపోవడం బాధాకరం. దాని గురించి నిర్వాహకులను ఎందుకు ప్రశ్నించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రైతులకు లభించే ఉచిత విద్యుత్‌ను ఇటుకబట్టీల నిర్వహణకు ఉపయోగించుకుంటున్నా ట్రాన్స్‌కో శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని కొందరు చెబుతున్నారు.

పిల్లలతో పనులు చేయిస్తే కఠినచర్యలు



బడీడు పిల్లలను ఎవ్వరూ కూడా పనుల్లో పెట్టుకోవద్దు. చిన్న పిల్లలతో పనులు చేయిస్తే చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటాం. బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు అందరూ సహకరించాలి. ఇటుకబట్టీల నిర్వాహకులకు పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దని సూచనలు, సలహాలు ఇస్తున్నాం.

– అన్వేష్ రెడ్డి, ఎస్ఐ, కుల్కచర్ల



ఇటుకలను కాల్చేందుకు ఏర్పాటు చేసిన బట్టీ



సుభ్యనాయక్ తండా గ్రామ సమీపంలోని బట్టీలో తల్లిదండ్రులతో చిన్నారులు

దోర్నాల్ వంతెనకు స్లాబ్ పనులు



వంతెనపై వేస్తున్న స్లాబ్ పనులను పరిశీలిస్తున్న ఏఈ శ్రావణ్‌కుమార్

ధారూరు: కాగ్నా నది ప్రవాహ ఉధృతికి 2016లో దెబ్బతిన్న వంతెనను పునర్మించడానికి 2017లో రూ.70కోట్లతో పనులు మొదలు పెట్టి శనివారం వంతెనకు స్లాబ్ పనులు పూర్తి చేశారు. 8 సంవత్సరాలుగా బాలారిస్టాలను దాటుకుంటూ ఈ వంతెన పనులు నిర్వహిస్తున్నారు. వంతెన పనులు పూర్తికాక ముగ్గరు వ్యక్తులు నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. ఎన్నో మూగజీవాలు మృతి చెందాయి. వానాకాలంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లడానికి, జిల్లాలోని తాండూర్, పరిగి, కొడంగల్ తదితర ప్రాంతాలతో పాటు ధారూరు మండలంలోని 26 గ్రామాల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఈ విషయం తెలుసుకున్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవ తీసుకుని పెండింగ్ బిల్లులు మంజూరు చేయించి సంవత్సర కాలంలో వంతెన పనులు పూర్తి చేసేలా శ్రమించారు. చివరగా మిగిలిన స్లాబ్ పనులను తాండూర్ ఆర్అండ్‌బీ ఏఈ శ్రావణ్ కుమార్ ప్రారంభించి సాయంత్రం వరకు పూర్తి చేయించారు. పనుల నాణ్యతను దగ్గర ఉండి ఆయన పర్యవేక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్ విక్రంసింహారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

తాండూరు: తాండూరు మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, జీఓ నంబర్ 60 అమలు చేయాలని కోరుతూ కమిషనర్ విక్రంసింహారెడ్డికి మున్సిపల్ కార్మికులు వినతి పత్రం అందజేశారు. శనివారం తాండూరు సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డిని కలిసి మాట్లాడారు. ఏళ్లుగా మున్సిపాలిటీలో పనులు చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. వేసవి కాలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే పారిశుద్ధ్య పనులు చేయించాలన్నారు. మరోవైపు ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ ప్రతినెల రూ.19,500ల చొప్పున వేతనాలు అందజేయాలని కోరారు. దీనికి స్పందించిన కమిషనర్ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే అమలు చేస్తామని కార్మికులకు భరోసా కల్పించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

నియోజక వర్గ బీజేపీ కోఆర్డినేటర్ నందు



మోమిన్‌పేటలోని మొరంగపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నందు తదితరులు

మోమిన్‌పేట: గ్రామాల అభివృద్ధే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని వికారాబాదు నియోజక వర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామంలో ఎంపీ నిధుల కింద రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన నిధులు మంజూరు చేయించారన్నారు. ప్రపంచంలోనే 5వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోది నిలబెట్టారన్నారు. గ్రామాల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల నిధులను విడుదల చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు భుజంగ్‌రెడ్డి, నర్సింహ్మరెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కంకల్ వీరభద్రేశ్వర స్వామి ఉత్సవాలు

పూడూరు: కంకల్ గ్రామంలో వెలసిన వీరభద్రేశ్వర స్వామి ఉత్సవాలను ఆదివారం నుంచి మార్చి 1 వరకు నిర్వహిస్తారని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. 23న ధ్వజారోహనం, 24న గీతాయజ్ఞం, పారాయణం, మంగళవారం మృత్యుంజయ హోమం, బుధవారం మహాశివరాత్రి, రుద్రాభిషేకం, గురువారం తెల్లవారు అగ్నిగుండం, 28 శుక్రవారం రథోత్సవం, రాత్రికి వీరభద్ర విజయం, మార్చి 1 శనివారం పార్వతి పరమేశ్వరుల కల్యాణం, పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

మోడల్ హౌస్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం స్థానిక నాయకులతో కలిసి ఆయన ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో మోడల్ హౌస్ నిర్మించాలని నిర్ణయించారు. నియోజకవర్గంలోని పేదలందరికీ ఇల్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హిమబిందు, పార్టీ నాయకులు, అధికారులు ఉన్నారు.

సీసీఐ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరిన కార్మిక సంఘం నేతలు



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నేతలు

తాండూరు రూరల్: మండల పరిధిలో కరన్‌కోట్ గ్రామ సమీపంలోని కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ కార్మిక సంఘం నేతలు కోరారు. శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నివాసానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నేతలు మాట్లాడుతూ.. సీసీఐ కంపెనీలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్‌లను యాజమాన్యం ఇవ్వడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గ్రూప్ ఇన్సూరెన్స్, పీఎఫ్ చెల్లించడం లేదన్నారు. ముఖ్యంగా గ్రాట్యూవిటీ కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సీసీఐ యాజమాన్యం రాజకీయం చేస్తోందని తెలిపారు. అదేవిధంగా తాండూరులోని పాత మున్సిపాల్టీలో ఏర్పాటు చేసిన ఈఎస్ఐ ఆస్పత్రిలో డాక్టర్లు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలో తాండూరుకు వచ్చి సీసీఐ యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని కార్మిక సంఘం నేతలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీఐటీయూ నేతలు రామకృష్ణ, మహిపాల్, శ్రీనివాస్, శరణప్ప, అనంతయ్య, నాగిరెడ్డి, జగదీష్, రాంరెడ్డి, లలిత, ఈరమ్మ తదితరులు ఉన్నారు.

నేడు, రేపు పల్లెగూడ హన్‌మాన్ దేవాలయం వద్ద లింగస్థాపన

తాండూరు రూరల్: మండల పరిధిలో చంద్రవంచ గ్రామ శివారులోని పల్లెగూడ హన్‌మాన్ దేవాలయ సమీపంలో లింగస్థాపన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురు హవా మల్లినాథ్ మహరాజ్ నిరుగుడి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆదివారం స్వామివారి పల్లకీసేవ, భజన, సోమవారం ఉదయం 5 గంటలకు లింగస్థాపన నిర్వహిస్తారని పేర్కొన్నారు. అగ్గనూర్ శోభవతి, అశోక్‌కుమార్‌లు లింగస్థాపన చేసేందుకు 10 గుంటల భూమిని ఉచితంగా అందజేశారని తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరిగి: విద్యుత్ సరఫరాకు ఆదివారం అంతరాయం కలగనున్నట్లు పరిగి విద్యుత్ ఏఈ హరికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిగి సబ్ స్టేషన్, రంగంపల్లి, రాపోల్ సబ్ స్టేషన్‌ల క్రింద ఉన్న అన్ని గ్రామాలకు సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గ్రహించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

ఎట్టకేలకు హైదరాబాద్ రోడ్డు పనులకు మోక్షం

నేడు శంకుస్థాపన

తాండూరు: హైదరాబాద్ రోడ్డు విస్తరణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఆరు నెలల క్రితం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని తాండూరు నుంచి వికారాబాద్ కలెక్టరేట్ వరకు 50 కిలోమీటర్ల పనులకు రూ.103 కోట్లు మంజూరు చేయించారు. అయితే నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టాల్సి ఉండగా కాంట్రాక్టర్ పనులు చేసేందుకు ముందుకు రాలేదు. నాలుగు నెలల పాటు కాంట్రాక్టర్‌కు పనులు చేయాలని చెప్పినా చేయకపోవడంతో ఇచ్చిన కాంట్రాక్ట్ పనులను రద్దు చేశారు. మరోసారి టెండర్ వేసి ఈ పనులను మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. రోడ్డు పనులను ఆదివారం పెద్దేముల్ మండలం ఖానాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

విద్యార్థులకు దాతల ప్రోత్సాహం అవసరం



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న మధుసూదనన్‌రెడ్డి

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్: పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహించాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఏఎంఆర్ ట్రస్టు చైర్మన్ ఎలుగంటి అభిరామ్‌రెడ్డి పదో తరగతి విద్యార్థులకు 850 పరీక్ష ప్యాడ్లు, బాక్స్‌లు, స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు దాతలు సహకరిస్తే వారు మరింత ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని చెప్పారు. తాము సంపాదించిన దాంట్లో కొంత డబ్బు పేద విద్యార్థుల కోసం ఖర్చు చేస్తానని తెలిపారు. అనంతరం వారు విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్‌లు రవీందర్‌నాయక్, మునగపాటి నర్సింలు, నాయకులు సూర్యగౌడ్, జంగయ్య, శ్రీనివాస్, శేఖర్, ఆంజనేయులు, థౌసిఫ్, రఫిక్, దయాకర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేయాలి

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్)ను రద్దు చేయాలని బీజేపీ యువ నాయకులు కల్వకోలు తిరుపతి అన్నారు. ఎల్ఆర్ఎస్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిందన్నారు. ఎన్నికల హామీలో ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామని ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత వసూలు చేయాలని చూస్తోందన్నారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పి, రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజల పక్షాన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆయన హెచ్చరించారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు!



బషీరాబాద్-ఎక్మాయి మధ్య సూచిక బోర్డు లేని మలుపు



ఎక్మాయి మలుపులో పెరిగిన ముళ్లచెట్లు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు

బషీరాబాద్: బషీరాబాద్ మండలంలోని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్ల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడంతో తరుచు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మూల మలుపుల వద్ద ముళ్లచెట్లు అడ్డంగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బషీరాబాద్–ఎక్మాయి, బషీరాబాద్–కొత్లాపూర్, ఇదంర్‌చెడ్–అయ్యాలం, నవల్గ–నీళ్లపల్లి, నీళ్లపల్లి–మైల్వార్, బషీరాబాద్–గంగ్వార్ గేట్ మధ్యలోని రోడ్ల మార్గాలలో ప్రమాదకరంగా మలుపులు ఉన్నాయి. ఇక్కడ ప్రమాదాల నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు ఎన్నో సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారులపై వాహనాలు వేగంగా వస్తూంటాయి. వాహనదారులు ఈ మలుపులను గమనించకపోతే అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. వాస్తవానికి అలాంటి మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లుగానీ, స్పీడ్ బ్రేకర్లుగానీ, హెచ్చరికలు, సూచిక బోర్డులుకానీ అధికారులు ఏర్పాటు చేయాలి. కానీ ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్లకంచెలను కూడా తొలగించడం లేదు. తాండూరు–బషీరాబాద్ మార్గంలో ముళ్ల కంచే రోడ్లపైకి ఏపుగా పెరిగాయి. దీంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.